క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నవాబుపేట: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె **యాదయ్య**ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ **నియోజకవర్గ** సీనియర్ నాయకుడు సున్నపు **వసంతం** తదితరులు కలిశారు. బీఆర్ఎస్‌ను **వీడి కాంగ్రెస్**లోకి రావడాన్ని వారు స్వాగతించారు. ఎమ్మెల్యే ప్రతి పక్షంలో ఉంటే అభివృద్ధికి ఆటంకం ఉంటుందని, కాంగ్రెస్‌లో ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

సర్కారు బడిలో చేర్పించండి

పూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడికి పంపించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధి అంగడిచిట్టంపల్లిలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా బోధన అందిస్తున్నామని తెలిపారు. ఉచితంగా నోట్‌బుక్స్, దుస్తులను అందజేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో చెత్త వేయొద్దు



చెత్త వేసే ప్రదేశంలో మొక్క నాటుతున్న మున్సిపల్ ఉద్యోగి

తాండూరు టౌన్: ఇంట్లోని చెత్త చెదారాన్ని వీధుల్లో వేసి, అపరిశుభ్రతకు కారకులు కావద్దు అని మున్సిపల్ కార్మికులు శుక్రవారం వినూత్న ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని వార్డుల్లో రోడ్డు పక్కన చెత్తను డంప్ ప్రదేశాన్ని శుభ్రం చేసి, ముగ్గులు వేసి మొక్కలు నాటారు. ఇక నుంచి ఇక్కడ చెత్త వేయకూడదని, బుట్టల్లో వేసి, మున్సిపల్ వాహనాలకు అందించాలని ప్రజలను కోరారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే ఈ ప్రచారం చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు.

మొక్కలు నాటేందుకు సిద్ధం

పూడూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని గ్రామీణాభివృద్ధి స్పెషల్ కమిషనర్ షఫీఉల్లా అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన మండల పరిధి మీర్జాపూర్‌లో పర్యటించారు. గ్రామంలో నర్సరీ, తెలంగాణ క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం తదితర అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో జరిగే పనుల గురించి ఈజీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో డీపీఓ జయసుధ, ఎంపీడీఓ పాండు ఉన్నారు.


మతి స్థిమితం లేని వ్యక్తి వీరంగం



వ్యక్తిని బంధించిన పోలీసులు

తాండూరు టౌన్: పట్టణంలో గురువారం అర్ధరాత్రి ఓ వ్యక్తి కనపడిన వారిపై దాడికి దిగాడు. దీంతో స్థానికులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. సదరు వ్యక్తిని పోలీసులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం అక్కడనుంచి తప్పించుకుని వచ్చి పలువురిపై దాడికి దిగాడు. సైకోగా భావించిన స్థానికులు చితకబాదారు. పోలీసులు అదుపులోకి తీసుకుని కాళ్లు, చేతులను తాళ్లతో బంధించారు. ఇదే విషయమై సీఐ సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా.. మానసిక స్థితి సరిగా లేదని.. హిందీలో మాట్లాడుతున్నాడని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా తాళ్లతో బంధించామన్నారు. సాయంత్రం కాస్తం నెమ్మదించంతో అక్కడ నుంచి పంపించేశారు.

శాకాంబరీ దేవిగా వాసవీ మాత



అమ్మవారి సన్నిధిలో భక్తులు

తాండూరు టౌన్: వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా తాండూరు పట్టణంలోని నగరేశ్వర ఆలయంలో కొలువుదీరిన వాసవీమాత శాకాంబరీ దేవిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మహిళా భక్తులు గోరింటాకు సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి, కౌన్సిలర్ సాహు శ్రీలత, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొట్రిక నాగలక్ష్మి, మంకాల స్వప్న, శోభ తదితరులు పాల్గొన్నారు.

మూత‘బడి’..

- బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు
- కొత్తవారు రాక.. తెరుచుకోని పాఠశాల తలుపులు
- చదువుకు దూరం అవుతున్న పేద విద్యార్థులు
- ముఖ్యమంత్రి ఇలాకాలో నిర్లక్ష్య వైఖరి



మూతపడిన పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాల (ఇన్‌సెట్లో) టీచర్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

కొడంగల్: ఉపాధ్యాయులు లేక ఆ పాఠశాల మూతపడింది. ఇక్కడ పని చేస్తున్న ఇద్దరు టీచర్లు ఇటీవల బదిలీపై వెళ్లగా.. వారి స్థానంలో మరో ఇద్దరిని ఇక్కడికి పంపించారు!. అయితే ఇందులో ఒకరు మెడికల్ లీవు పెట్టగా, మరో టీచర్‌ను పూర్వస్థానం నుంచి విద్యాశాఖ అధికారులు రిలీవ్ చేయలేదు. దీంతో బడి మూతపడింది.

వచ్చిన టీచర్ లీవులో..

విద్యాసంవత్సరం ప్రారంభంలో మున్సిపల్ పరిధి పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కళకళలాడింది. పిల్లలకు దుస్తులు, పుస్తకాలు ఇచ్చారు. పాఠాలు కొనసాగాయి. కానీ ఈ మధ్యలో చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా అందులో పనిచేస్తున్న ఇద్దరు టీచర్లను బదిలీపై మరో ప్రాంతానికి పంపించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వెళ్లిన వారి స్థానం భర్తీ చేయడం విద్యాశాఖ అధికారులు మరిచారు!. ఇద్దర్ని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఒక్కర్ని పంపించారు. మరొకర్ని ఇంతవరకు పంపించలేదు. వచ్చిన ఆ ఒక్క టీచర్ కూడా సెలవులపై వెళ్లగా.. ఆ బడి తలుపులు తెరుచుకోవడం లేదు. ఇది తెలియని విద్యాకుసుమాలు.. భుజాన పుస్తకాల సంచితో పాఠశాల తెరిచే సమయానికి వచ్చి.. టీచర్ల కోసం ఎదురు చూడటం నిత్యకృత్యంగా మారింది. ఇదే విషయమై గ్రామస్తులు పలుమార్లు విద్యాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మాస్టర్ల దుమ్మా

జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పాఠశాలకు ఈ దుస్థితి పట్టిందని స్థానిక నాయకులు, ప్రజలు ఆరోపించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో వెంటనే చేరడం లేదని, బదిలీల ప్రక్రియలో ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును ఆసరాగా చేసుకొని దుమ్మా కొడుతున్నారని విమర్శించారు.

నష్టపోతున్న విద్యార్థులు

అధికారుల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డలు చదువుకు దూరం అవుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో ఉపాధ్యాయులు, అధికార యంత్రాంగం ఇష్టంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు, పాలకులు జోక్యం చేసుకుని, విద్యార్థులు నష్టపోకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అక్కడ ఇబ్బంది అవుతుందని..

పాఠశాలకు కేటాయించిన టీచర్ మెడికల్ లీవ్‌లో వెళ్లారు. మరో ఉపాధ్యాయురాలు అన్నారం గ్రామ పాఠశాలలో పనిచేస్తున్నారు. కానీ ఆమెను అక్కడి నుంచి రిలీవ్ చేయలేదు. చేస్తే అక్కడ ఇబ్బంది అవుతుంది. ఆ కారణంతో రిలీవ్ చేయలేదు.

– రాంరెడ్డి, ఎంఈఓ

మైలమ్మకు బోనాలు



బోనం సమర్పిస్తున్న భక్తులు

కుల్కచర్ల: మైలమ్మ చెరువులో మైలమ్మ అమ్మవారికి మత్స్యసహకార సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బోనం ఎత్తారు. డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా అమ్మవారి చెంతకు చెరుకుని ప్రదక్షిణలు చేశారు. అనంతరం బోనం(నైవేద్యం) సమర్పించారు. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పల్లెలు పచ్చగా ఉండేలా చూడు తల్లి అని భక్తులు అమ్మవారిని కోరుకున్నారు. కార్యక్రమంలో చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మణ్, సంఘం డైరెక్టర్లు మొగులయ్య, సిద్దయ్య, గుంటి సాయప్ప, బిచ్చయ్య, వెంకటయ్య, భీమయ్య, యాదయ్య, సత్తయ్య, హన్మయ్య, ఆంజనేయులు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

దోమ: పేద కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని హెదరాబాద్ యూత్ కరేజ్ (ఎచ్‌వైసీ)సల్మాన్ ఖాన్ అన్నారు. మండల పరిధి బొంపల్లికి చెందిన షబ్బీర్ కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా కుటుంబీకులు ఇంటివద్దే ఆక్సిన్ అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఖాన్.. శుక్రవారం బాధితుడిని పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఖాన్ మాట్లాడుతూ.. పేద కుటుంబం కావడంతో భార్య వదిలి వెళ్లిపోవడం, తల్లి కుమారుడిని ఆక్సిజన్‌తో కాపాడుకోవడం తనను కలచి వేసిందన్నారు. తన వంతు సహాయంగా సాయం చేశానన్నారు. పూడూర్ మాజీ ఎంపీటీసీ ఆదీల్, మండల కోఆప్షన్ మాజీ సభ్యులు ఆయూబ్, సదర్ ఖలీల్ మోటసాబ్, మహిమూద్, షఫీ, మోహిన్, రియాజ్, మోహిజ్, ముక్తార్, ఇబ్రహీం, మోసిన్, ఫైమోద్దీన్, ఇంతియాజ్ ఉన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న సల్మాన్ ఖాన్

సైకిల్‌పై సంపూర్ణ యాత్ర

- సనాతన ధర్మ ప్రచారం కోసం ప్రయాణానికి శ్రీకారం



యాత్రికుడితో మహాదేవుని భజన మండలి సభ్యులు

కొడంగల్ రూరల్: సనాతన ధర్మ ప్రచారం కోసం 60వేల కిలో మీటర్ల సైకిల్ యాత్రకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యకు చెందిన రాజెందర్‌శర్మ శ్రీకారం చుట్టారు. నాలుగు నెలలుగా కొనసాగుతున్న యాత్ర.. రాత్రి కొడంగల్‌కు చేరుకోగా.. పట్టణంలోని మహాదేవుని ఆలయంలో యాత్రికుడు విశ్రాంతి తీసుకున్నాడు. ఈ సందర్భంగా రాజెందర్ మాట్లాడారు. వస్త్ర వ్యాపారం చేస్తూ ఢిల్లీలో స్థిరపడ్డానని తెలిపారు. హిందూ ధర్మంపై దేశమంతా అవగాహన కల్పించాలనే సంకల్పంతో మార్చి 13న అయోధ్య నుంచి సంపూర్ణ దేశ యాత్ర ప్రారంభించానని, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మీదుగా తెలంగాణకు వచ్చానని పేర్కొన్నారు. ఈ యాత్రలో 12 ద్వాదశ జ్యోతిర్లింగాలు, 51శక్తి పీఠాలు, చార్‌ధామ్, పంచకేదార్‌లలో పర్యటిస్తూ స్వస్థలానికి చేరతానని, ఇప్పటి వరకు 8వేల కి.మీ. దూరం ప్రయాణం చేశానని వెల్లడించారు.

సంక్షిప్త వార్తలు

◆ స్పీకర్‌ను కలిసిన ఐజీ



ధారూరు: మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ శుక్రవారం ధారూరు రైతు వేదికలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాంతిభద్రతల గురించి చర్చించారు. ఐజీ వెంట ఎస్పీ నారాయణరెడ్డి ఉన్నారు.

◆ కార్మికులకు వేతనాలు చెల్లించండి

బంట్వారం: పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏడు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

◆ కొత్త చట్టాలపై అవగాహన

దోమ: కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఏఎస్ఐ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతన చట్టాలు, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నూతన చట్టాల విధివిధానాలను తెలుసుకోవాలని సూచించారు. ప్రతి వాహనదారురు ట్రాఫిక్ నిబంధనలు పాటించి.. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ఇందులో కానిస్టేబుల్స్ పురుషోత్తం ఉన్నారు.

◆ మహిళా సంఘాలను బలోపేతం చేయండి

కొడంగల్: మహిళా సంఘాలను బలోపేతం చేయాలని మండల ప్రత్యేక అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఉపాధి అవకాశాలు పెంచి, ఆర్థిక స్వావలంబన సాధించాలని చెప్పారు. ఇందులో సమాఖ్య మండల అధ్యక్షురాలు అంజిలమ్మ, ఏపీఎమ్ వెంకన్న, ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించాలి


బంట్వారం: ప్రైవేటు విద్యా సంస్థల్లో బీసీ విద్యార్థులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి, ఉచితంగా అడ్మిషన్లు ఇవ్వాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలా కాలంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందడం లేదన్నారు. ఫీజులు చెల్లించాలంటూ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు.

◆ ఉత్సవంగా వన మహోత్సవం..



కొడంగల్ రూరల్: విరివిగా మొక్కలు నాటి వన మహోత్సవాన్ని ఉత్సవంగా జరపాలని గిరిజన గురుకుల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అన్నారు. మున్సిపల్ పరిధి పాత కొడంగల్ శివారులోని గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

◆ సేవలు మరువలేనివి



కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన బ్యాంకు అధికారుల సేవలు మరువలేనివని ముజాహిద్‌పూర్ గ్రామస్తులు కొనియాడారు. శుక్రవారం గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రవికాంత్, ఫీల్డ్ ఆఫీసర్ నాగిరెడ్డిలు బదిలీపై వెళ్తుండగా.. వారిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

◆ బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ

మర్పల్లి: ఎస్ఐగా వి.సురేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పోలీస్ స్టేషన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

◆ లక్ష్మీదేవికి ఆషాఢం పూజలు



బొంరాస్‌పేట: ఆషాఢ మాసం సందర్భంగా మండల పరిధి రేగడిమైలారం బండల లక్ష్మమ్మకు భక్తులు పూజలు చేశారు. శుక్రవారం ఉదయం జల్దీ, బోనాలతో ఊరేగింపు, అనంతరం అన్నదానం కార్యక్రమాలు కుర్వ, యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

◆ ‘గురు’తరమైన బాధ్యత

దోమ: గురువులది గురుతరమైన బాధ్యత అని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సహచర టీచర్లు ఘనంగా సన్మానించారు. ఎంఈఓ హరిశ్చందర్‌తో కలిసి మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన బోధనను అందించేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇదులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాంచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యాయులు రాములు ఉన్నారు.

◆ పారిశుద్ధ్య పనుల పరిశీలన

కొడంగల్: మున్సిపల్ పరిధి గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను కమిషనర్ బలరాం నాయక్ శుక్రవారం పరిశీలించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం, రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లకంపను కమిషనర్ దగ్గరుండి కార్మికులచే తొలగింపచేశారు. వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

◆ ఐదో రోజున ఆలై గుంత

దుద్యాల్: మండల పరిధి హస్నాబాద్ గ్రామంలో పీర్లు కొలువుదీరిన పెద్ద మసీదు ఎదుట నిర్వాహకులు శుక్రవారం అలై గుంత తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మొహర్రం ప్రారంభమయిందని చెప్పారు. ఆచారం ప్రకారం ఐదో రోజున పెద్దగా ఆలై గుంత తవ్వుతామని తెలిపారు. ఆఖరి రోజున అలై చుట్టూ అస్సైదుల ఆడతామని పేర్కొన్నారు.

‘భూములకు పరిహారం పెంచండి’



వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్: అభివృద్ధి కోసం భూములను వదులుకుంటున్న తమకు పరిహారం పెంచి ఇవ్వాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. అప్పాయిపల్లి సర్వే నంబర్ 19లో భూములు ఉన్న రైతులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కడా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తమ భూములను మెడికల్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. తొలుత భూ సేకరణకు వచ్చిన అధికారులు ఎకరాకు రూ.10లక్షలు, అర్హత ఉంటే ఉద్యోగం, ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ ఆ నష్ట పరిహారం సరిపోదని పేర్కొన్నారు. ఈ మేరకు కడ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నాగిరెడ్డి, వెంకటయ్య, బుస్స చంద్రయ్య, కొత్తూరు చంద్రయ్య, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేష్‌బాబు, సూర్యానాయక్, లింగం సాయిలు, ఎరన్‌పల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గుంత..

ఆదమరిస్తే అంతే!



భీమరాయ ఆలయ సమీపంలో రోడ్డుపై గుంత

దుద్యాల్: రోడ్డుమధ్యలో ఏర్పడిన గుంత స్థానికులను, వాహనదారులను కలవరపాటుకు గురిచేస్తుంది. ఎప్పుడు ఎవరు దాని బారిన పడతారో అని భయాందోళన చెందుతున్నారు. మండల పరిధి హస్నాబాద్ గ్రామం భీమరాయ గుడి సమీపంలో రోడ్డు మధ్యలో భారీ గుంత ఏర్పడింది. ఆ మార్గం గుండా అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ మాత్రం ఆదమరచినా ప్రమాదంలో పడక తప్పదని వాహనచోదకులు తెలిపారు. గుంతతో గతంలో పలు ప్రమాదాలు జరిగాయని చెప్పారు. అధికారులు స్పందించి గోతిని పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అండగా ఉంటా..



మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: ఐదేళ్ల పాటు గ్రామాల అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి పాటుపడి, పదవీకాలం ముగించుకున్న మీ సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. ప్రజలందరికీ గుర్తుండి పోతారన్నారు. శుక్రవారం మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మీకు అండగా ఉండి, సమస్యల పరిష్కారానికి నిధులను మంజూరు చేసి ప్రజల ఆదరాభిమానాలను చూరగొందని వెల్లడించారు. భవిష్యత్తులో మీ సేవలు ప్రజలకు అందాలని ఆకాంక్షించారు. మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గౌడి వెంకటేశం, మొగులప్ప, రాజప్ప గౌడ్, రాంలింగారెడ్డి, ఉమాశంకర్, రాజేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించండి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతగిరి: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత, జిల్లా అధ్యక్షుడు అక్బర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఐదు సంవత్సరాల నుంచి విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఫీజులు పెండింగ్ ఉండటంతో ప్రైవేట్ విద్యా సంస్థలు సంబంధిత ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా, కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షుడు అనిల్, జిల్లా నాయకులు పవన్, ముత్యం, తేజ, రహమాన్, కార్తీక్, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు



పరిగి: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

- మండల విద్యాధికారి హరిశ్చందర్

పరిగి: నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. పట్టణ కేంద్రంలోని నంబర్1 ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై, పదోన్నతులపె వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, నవ సమాజ స్థాపనకు కృషి చేసిన వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమతమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు సహజం



ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దేముల్: ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్, వెంకటలక్ష్మి, నఫీసుల్తానా, సంగీత, రాధతో పాటు.. విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు అన్నపూర్ణ, సంతోష, శిరీష, నజీయాబేగం, రహనాను గ్రామ ప్రజలు, బోధనా సిబ్బంది, విద్యార్థులు స్వాగతం, వీడ్కోలు పలుకుతూ సన్మానించారు. ఇందులో ఉపాధ్యాయులు రవీదర్‌రెడ్డి, నర్సిరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్‌లు అక్షయ, బేగం తదితరులు ఉన్నారు.